క్లుప్తంగా

నాగలక్ష్మికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



సినీనటి రేణుదేశాయ్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న నాగలక్ష్మి

నరసాపురం: నరసాపురం పట్టణం 10వవార్డు మున్సిపల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వెంపరాల వీఎస్ఎస్ నాగలక్ష్మి సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సినీనటి రేణూదేశాయ్ చేతుల మీదుగా అందుకున్నారు. భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సర్వే ద్వారా అభిప్రాయ సేకరణ చేసి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఈ సర్వేలో పశ్చిమ గోదావరి నుంచి నాగలక్ష్మి ఎంపికైంది. ఇంగ్లిష్ టీచర్‌గా నాగలక్ష్మి ఇప్పటికే పలు అవార్డులు సాధించారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



కవిటంలో సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

పోడూరు: ఉపాధి హామీ పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలో భాగంగా మండలంలోని నాలుగు గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. కవిటం, పి.పోలవరం, అప్పన్నచెరువు, రావిపాడు గ్రామాల్లో చేసిన పనులపై తనిఖీ నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, డీఆర్‌పీలు, ఫీల్డ్అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు పోడూరులో..

సామాజిక తనిఖీలో భాగంగా శనివారం పోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.మంగాకుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సభలో ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు టెస్ట్ పేపర్ల పంపిణీ



మోడల్ టెస్ట్ పేపర్స్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మొగల్తూరు: రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని నరసాపురానికి చెందిన జివాజీ గోల్డ్ సంస్థ ప్రతినిధులు కోరారు. శుక్రవారం మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలలకు చెందిన 317 మంది విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపల్లి కృష్ణమోహన్, చింతలపూడి శ్రీనివాస్, కార్యదర్శి కొల్లాటి బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు ఎడ్లపల్లి ధర్మారావు, నేతల బుజ్జిబాబు, మేళం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ మండల బీజేపీ అధ్యక్షుడిగా నాగూర్

పెనుగొండ: బీజేపీ పెనుగొండ మండల అధ్యక్షుడిగా దొడ్డి పట్ల నాగూర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సహాయ ఎన్నిక అధికారి వంగూరి రామకృష్ణ ప్రకటించారు. శుక్రవారం సిద్ధాంతంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో వడలికి చెందిన దొడ్డిపట్ల నాగూర్ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఎన్నికల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.రాఘవులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరు వెంకట రెడ్డి, నియోజకవర్గ కన్వీనరు కేహెచ్‌వీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

ఇరగవరం: ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహనతో ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని కొత్తపాడు, అయినపర్రు తదితర గ్రామాల్లో రబీ పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులు పలు సూచనలు చేశారు. త్వరగా వరి నాట్లు పూర్తి చేయాలని తెలిపారు.

విద్యార్థుల మేధకు పదును

- అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటుతో అద్భుత ప్రయోజనాలు
- జాతీయ స్థాయిలో లంకలకోడేరు విద్యార్థుల ప్రతిభ



ఆల్కాహాల్ అలర్ట్ వెహికల్ నమూనా



చంద్రయాన్-3 నమూనా



స్మార్ట్ కార్ పార్కింగ్ నమూనా



థర్డ్ ఐ (మూడో కన్ను) నమూనా

పాలకొల్లు అర్బన్: స్థానిక లంకలకోడేరు జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా ప్రాక్టికల్స్ ద్వారా తమ మేధస్సుకు పదును పెట్టుకుంటున్నారు. విద్యార్థులు తరగతి గదిలోనే శాస్త్రవేత్తలుగా తయారయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకుంది. ఈ చర్యల్లో భాగంగా కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో 'అటల్ టింకరింగ్ ల్యాబ్'లను 2019లో ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లో ఉపాధ్యాయుల సాయంతో విద్యార్థులు చేస్తున్న ప్రయోగాలు ఆకట్టుకుంటున్నాయి.

ప్రయోగశాలతో సాటిలేని ఫలితాలు

అటల్ టింకరింగ్ ల్యాబ్ అందుబాటులో ఉండడంతో 2022లో న్యూఢిల్లీలో నిర్వహించిన 'స్కూల్ ఇన్నోవేషన్ మారథన్' కార్యక్రమంలో లంకలకోడేరు విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సైన్స్ ప్రదర్శనలో రోబోటిక్ విభాగంలో 10 మోడల్స్‌ను సిద్ధం చేశారు. రోబోటిక్ విభాగంలో చంద్రయాన్-3, స్మార్ట్ కార్ పార్కింగ్, పెట్ ఫుడ్ డిస్పెన్సర్, ఆటోమెటిక్ క్లోజ్డ్ బ్రిడ్జి, మూడో కన్ను (థర్డ్ ఐ), ఆల్కహాల్ అలర్ట్ వెహికిల్, స్మార్ట్ కంట్రోల్ ఫర్ ఫార్మర్స్ వంటి వాటిని తయారు చేశారు. ఈ ప్రాజెక్టులకు ఇటీవల విజయవాడ, వైజాగ్, భీమవరంలో నిర్వహించిన విద్యావైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొని అధికారుల మన్ననలు పొందుతున్నారు.

సైన్స్ టీచర్ సహాయంతో..



శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రదర్శించిన చంద్రయాన్-3 మోడల్‌ని సైన్స్ టీచర్ సుబ్రహ్మణ్యం ప్రోత్సాహంతో రూపొందించా. చంద్ర మండలంపై ల్యాండ్ అయిన తరువాత రోవర్ పనితీరు మోడల్‌ని తయారు చేసి విజయవాడలో ప్రదర్శించాం. అక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరూ మా చంద్రయాన్ మోడల్‌ని తిలకించి ప్రత్యేకంగా అభినందించారు.

– దేవరకొండ వెంకటేష్, విద్యార్థి

అంధుల కోసం ప్రాజెక్టు



అంధులకు వారికి ఉపయోగపడేలా మూడో కన్ను (థర్డ్ ఐ)ని ప్రాజెక్టును రూపొందించా. కంటి అద్దాలకు అమర్చిన సెన్సార్‌లు అంధులు రోడ్డు మీద నడిచి వెళ్లే సమయంలో ఏదైనా అడ్డు వస్తే వెంటనే అలారం శబ్దం వినపడి నడిచే వ్యక్తి మార్గాన్ని మారుస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా అంధులకు చాలా ఉపయోగాలున్నాయి.

– అలమండ మోహన సుదీప్, విద్యార్థి

ప్రమాదాల నివారణకు ఆల్కహాల్ అలర్ట్



నేను ఆల్కహాల్ అలర్ట్ వెహికిల్‌ను తయారు చేశారు. మద్యం సేవించి ఈ వాహనం దగ్గరకు వెళితే వాహనం స్టార్ట్ అవ్వదు. మద్యం వాసనను వాహనంలో ఏర్పాటు చేసిన సెన్సార్‌లు గ్రహించి వాహనం స్టార్ట్ కాకుండా నిరోధిస్తాయి. మద్యం తాగి వాహనాలను నడపడం వల్ల కలిగే ప్రమాదాలను నివారించడానికే ఈ ప్రాజెక్టు చేశాను.

– జిళ్లెల్ల సంతోష్, విద్యార్థి

స్మార్ట్ కార్ పార్కింగ్ తయారు చేశా



అపార్టుమెంట్ ప్రాంతాల్లోనూ, లేదా ఏదైనా ఫంక్షన్ హాలు వద్ద, రద్దీ ఉండే ప్రాంతాలకు వెళ్లేటప్పుడు కారు పార్కింగ్ సమస్య ఎదురవుతుంది. అప్పుడు ఈ కారులో ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ సెన్సార్‌లు కార్ పార్కింగ్ స్థలాన్ని సూచిస్తుంది. ముఖ్యంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ కార్ పార్కింగ్ సిస్టమ్ ఎంతో ఉపయోగపడుతుంది.

– వీర పృథ్వీ నాగ వరుణ్, విద్యార్థి

సావిత్రిబాయి ఫూలేకు ఘన నివాళి



పాలకొల్లు సెంట్రల్: జీవీఎస్‌వీఆర్‌ఎం ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: సమాజంలో మహిళా విద్యపై వ్యతిరేకత ఉన్న కాలంలో భారతీయ మహిళా ఉపాధ్యాయురాలిగా ఎదిగిన గొప్ప మహిళ సావిత్రి బాయి పూలే అని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి తెలిపారు. శుక్రవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రోజారమణి మాట్లాడుతూ సావిత్రిబాయ్ పూలే గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. స్త్రీల విద్య కోసం ప్రత్యేక పాఠశాలల కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయురాళ్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయినులు చంద్రకళ, శశికళ, దుర్గాభవానీ పాల్గొన్నారు.

రామ్‌శ్లోక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని నేటి ఉపాధ్యాయులందరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక పెదగరువు ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని మండలంలోని సగం చెరువు పాఠశాలలో పని చేస్తున్న యడ్ల విజయలక్ష్మి కళావతి, షేక్ సాధికున్నిసాలను ఘనంగా ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిల్లా సురేష్ బాబు, ఫౌండేషన్ సభ్యులు మంతెన వెంకట రిషి శ్లోక్, సీఆర్ఎంటీ బీపీ వినయలత, ఉపాధ్యాయుడు టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: పట్టణంలోని బీజీబీఎస్ మహిళా కళాశాలలో శుక్రవారం భారత మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు.

ఆచంటలో..

పెనుగొండ: మొట్ట మొదటి ఉపాధ్యాయురాలిగా సావిత్రి బాయి పూలే మహిళకు ఆదర్శ ప్రాయురాలిగా, మహిళా శక్తిగా నిలిచారని ఆచంట సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆచంట పంచాయతీ వద్ద ఘనంగా నివాళులర్పించి ఎంఈఓ ఎ.ఉషారాణి, ఉపాధ్యాయులు పూడి ధనలక్ష్మి, డి.పుష్పలతలను ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో కార్యదర్శి జీవీఎల్ నరసింహరావు, వీఆర్వోలు సీతారాం, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే ఆశయాలను ప్రతి ఒక్క మహిళ అందిపుచ్చుకుని ముందుకు నడవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని కోరారు. మండలంలోని కట్టుపాలెం గ్రామంలో సంఘ పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యాలరావు నివాసంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్న ముగ్గురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్, మామిడిశెట్టి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం: బీజీబీఎస్ కళాశాలలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



పెనుగొండ: ఆచంటలో ఉపాధ్యాయురాళ్లను సత్కరిస్తున్న సర్పంచ్ సరోజని



యలమంచిలి: కట్టుపాలెంలో మహిళలకు సన్మానం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



అదనపు తరగతుల భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుగొండ: కళాశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్లు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో రూ.రెండు కోట్లుతో నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, కళాశాల పాలక వర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు పాల్గొన్నారు. అనంతరం పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనిఖీ చేశారు, జాతీయ విద్యావిధానంలో పెనుమార్పులకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలసిసహపంక్తి భోజనాలు చేసారు. ప్రిన్సిపాల్ ఎస్తేరు క్వీనీ, వేంద్ర రాము, నక్కా శాస్త్రి తదితరలులు పాల్గొన్నారు.

నేడు పాలకొల్లులో లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహణ

పాలకొల్లు సెంట్రల్: దృష్టి లోపం ఉన్న వారి కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిని కనిపెట్టి లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం పాలకొల్లు పట్టణంలో నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు పాలకొల్లు పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని దృష్టి లోపం ఉన్న దివ్యాంగులంతా పాల్గొనాలని కోరారు.

పద్మశాలీ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

పాలకొల్లు అర్బన్: పద్మశాలీ సంఘీయులు ఐకమత్యంతో జీవిస్తూ సంఘ బిడ్డలను విద్యాపరంగా అభివృద్ధిలోకి తీసుకురావడానికి కృషి చేయాలని పద్మశాలీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కట్టా లక్షణస్వామి అన్నారు. పాలకొల్లు పట్టణంలోని వీవర్స్ కమ్యూనిటీ భవనంలో శుక్రవారం సంఘ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘ నాయకులు నీలంశెట్టి సత్యప్రసాద్, నూలి సత్యనారాయణ, సూదా కాంతారావు, వింజమూరి చంద్రశేఖర్, వంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాళీపట్నం భూముల సమస్యను పరిష్కరించాలి



మొగల్తూరు: జగన్నాథపురంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న స్థానికులు



పోడూరు: పి.పోలవరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫాజిల్

మొగల్తూరు: కాళీపట్నం భూముల సమస్యను పరిష్కరించి క్రయవిక్రయాలకు అనుమతించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు తహసీల్దార్ కె.రాజకిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని జగన్నాథపురం, పాతపాడు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథపురం సదస్సులో 10 మంది రైతులు హాజరై 1 వినతిని అందించగా, పాతపాడు గ్రామంలో 15 మంది రైతులు హాజరై 4 వినతులు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు సరిపల్లి శ్రీలక్ష్మీ హర్షిత, కొప్పాడి లక్ష్మీతులసి, పులపర్తి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు మంతెన పాండు, మల్లాడి శాంతి రత్నం, నాయకులు నడంపల్లి రామకృష్ణంరాజు, సరిపల్లి సుబ్బరాజు, తోటకూర శివాజి రాజు పాల్గొన్నారు.

పి.పోలవరంలో..

పోడూరు: గ్రామాల వారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ కోరారు. పి.పోలవరం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ మౌలానా ఫాజిల్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ సదస్సులో రైతుల నుంచి అధికారులకు 11 వినతులు అందాయి. కార్యక్రమంలో సర్పంచ్ కుచ్చర్లపాటి పద్మనాభరాజు, ఆర్ఐ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు కాపు సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



విలేకరులతో మాట్లాడుతున్న కాపు సంఘం నాయకులు

నరసాపురం: నియోజకవర్గ కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు కాపు సంఘ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సురేష్ తెలిపారు. శుక్రవారం సంబరాలు జరపనున్న సీతారామపురం కొండవీటి వారి తోటలో కాపు సంఘ నాయకులు విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 1న జరగాల్సిన కాపు కార్తీక వన సమారాదన తుఫాన్ కారణంగా రద్దు కావడంతో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంప్రదాయబద్ధంగా భోగిమంటలు, గొబ్బిళ్లు, గంగిరెద్దులు, హరిదాసులు కోలాటాలు, బుట్టబొమ్మలతో వేడుకగా కార్యక్రమం జరుపుతామని పేర్కొన్నారు. దాదాపు 40 వేలమందికి మధ్యాహ్నం ఆత్మీయ విందు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సమావేశంలో కావలి నాని, తమ్మిశెట్టి బాబ్జి, గుగ్గిలపు మురళి, డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



యలమంచిలి: బాలింతకు రేషన్ సరుకులు అందిస్తున్న మహ్మద్ హసీనా



పాలకొల్లు అర్బన్: దగ్గులూరులో పోషకాహార విలువలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారం తినకపోతే రక్తహీనత సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మంగ అన్నారు. మండలంలోని దగ్గులూరులో ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు శుక్రవారం గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలింతలు బిడ్డ పుట్టిన గంట లోపు వారికి ముర్రుపాలు పట్టించాలని సూచించారు. దీని వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.శ్రీదేవి, సీహెచ్ దుర్గ, బి.ఆశా పాల్గొన్నారు. అలాగే కొత్తపేట, దిగమర్రు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు హేమలక్ష్మి, తులసి, సునీత పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇకపై గర్భిణుల నమోదు రెండవ నెల నుంచే ప్రారంభిస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా చెప్పారు. విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే సందర్భంగా శుక్రవారం యలమంచిలి వన్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు సమావేశం నిర్వహించి పోషకాహార ఆవశ్యకత గురించి వివరించారు. ఈ సందర్భంగా పిల్లల బరువు, ఎత్తు కొలిచారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు రేషన్ సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నాగ మహాలక్ష్మి, టి.జ్యోతి, డి లక్ష్మీ ఆశ కార్యకర్తలు శ్రీలక్ష్మీ, రాజేశ్వరి, ప్రసన్న, సుజిత తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీఓ బి.ఊర్మిళ సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తపాలెం, మొగల్తూరు పంచాయతీలోని శాలిపేట, కొత్తకాయలతిప్ప, గొల్లగూడెం ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారులకు పౌష్టికాహారం అందించే విధానాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పెద్దింట్లు, త్రివేణి, సీతారత్నం, నాగలక్ష్మి, మంగా మణి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి క్రీడలను ప్రారంభిస్తున్న సుబ్బారావు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ కళాశాలలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి గాదె సుబ్బారావు సంక్రాంతి క్రీడల పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు క్రీడల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. శనివారం జూనియర్ కళాశాల విద్యార్థులకు క్రీడలు, సోమవారం తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు, మంగళవారం మెహందీ డిజైన్ పోటీలు, బుధవారం సాంప్రదాయ వస్త్రధారణ, ముగ్గుల పోటీలు, గురువారం ఫుడ్ ఫెస్ట్, హ్యాండిక్రాఫ్ట్ పోటీలు, శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, వి.విజయలక్ష్మి, పీడీ జి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.